www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 ఏప్రిల్ 2023
5
వైఎస్ఆర్

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను నట్టేట ముంచారని, తాను అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ఏటా జనవరి 1న జాబ్ కేలెండర్ ప్రకటిస్తానని హామీఇచ్చి మాట తప్పారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించక, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధి ప్రభుత్వంనుంచి సహకారం లేక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఏటా మెగా డిఎస్‌సి అన్న వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని తెలిపారు. కమీషన్ల కక్కుర్తితో 4 ఏళ్లుగా రూ.17 లక్షల కోట్లు పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో ప్రతి నెల 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ. 2 వేల నిరుద్యోగ భృతి ఇస్తే, జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని తెలిపారు.

బోగస్..బోగస్!

- స్టాఫ్ నర్సుల భర్తీలో బోగస్ మార్కులే
- తాజాగా మరో ఏడుగురు వెలుగులోకి
- మార్కుల మాఫియాపై విచారణ ఏదీ?
- నిద్రావస్థలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ

స్టాఫ్ నర్సుల భర్తీ బాగోతం సీరియల్‌ను తలపిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద కడప రీజనల్ డైరెక్టర్ కార్యాలయ యంత్రాంగం పెద్దఎత్తున నర్సింగ్ పోస్టులను భర్తీ చేసింది. చిత్తూరు జిల్లా కేంద్రంగా ఓ గ్యాంగ్ దరఖాస్తుదారుల ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసే బోగస్ మార్కులుగా మార్చి అనర్హులకు ఉద్యోగాలు దక్కేలా చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు జిల్లా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ గత నెల 14న ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టులను పరిశీలించి బోగస్ మార్కులుగా నిర్ధారించి పంపించింది. తాజాగా మరోసారి ఏడుగురికి బోగస్ మార్కులతో ఉద్యోగాలు లభించినట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ 2022 నవంబర్‌లో 957 స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జోన్-4 కేటగిరీ కింద 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను కేటాయించింది. జిల్లాలోని ఆర్‌డి కార్యాలయం 2023 జనవరిలో స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేసింది. గైడ్‌లైన్స్ ప్రకారం రిక్రూట్‌మెంట్ చేపట్టకపోవడంతో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. స్టాఫ్‌నర్స్ దరఖాస్తులు, కోవిడ్ సేవల సీనియారిటీ పత్రాలు పరిశీలనలో నిర్లక్ష్యం మొదలుకుని బోగస్ మార్కులు, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు రిక్రూట్‌మెంట్‌లో మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందడంపై అనుమానం రావడంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా డొంకంతా కదిలింది. రాజధాని కేంద్రంలోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ 44 అనుమానిత దరఖాస్తుల్లో 15 దరఖాస్తులను పరిశీలించినట్లు సమాచారం. వీటిలో మొదటి విడత కింద ఎనిమిది మంది మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించడం తెలిసిందే. తాజాగా రెండవ విడత కింద మరో ఏడుగురు బోగస్ మార్కులతో ఉద్యోగాలు పొందినట్లు తేల్చినట్లు సమాచారం. గత నెలలో బయటపడిన బోగస్ మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందిన వారు చిత్తూరు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరుగురు, ఆర్‌డి కార్యాలయ పరిధిలో ఉద్యోగాలు పొందిన ఇద్దరు, ఒకరు ఉద్యోగంలో చేరాల్సి ఉన్నట్లు తేలిన సంగతి తెలిసిందే. తాజా ఏడుగురు బోగస్‌మార్కుల ద్వారా పొందడం విమర్శలకు ఆస్కారం కలిగిస్తోంది. వీరి మార్కుల వివరాలను మాత్రమే వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వెల్లడించినట్లు సమాచారం. పూర్తి వివరాలతో కూడిన సమాచారం ఇవ్వాలని ఆర్‌డి కార్యాలయం కోరింది. పూర్తి సమాచారం అందిన అనంతరం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో చోటు చేసుకున్న ఇటువంటి ఘటనలో కేసు నమోదు చేసి, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజా ఉదంతంతో ఇటువంటి దిశగా ఆలోచనలు చేయక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి వినిపిస్తోంది.

మరో ఏడుగురు వాస్తవమే

స్టాఫ్‌నర్సు రిక్రూట్‌మెంట్‌లో మరో ఏడుగురు బోగస్ మార్కుల ద్వారా ఉద్యోగాలు పొందినట్లు సమాచారం అందింది. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ నుంచి పూర్తిస్థాయి సమాచారం అందాల్సి ఉంది. అనంతరం బోగస్ మార్కుల బాగోతంపై దృష్టి సారిస్తామని పేర్కొనడం గమనార్హం.

- డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, కడప.

హంస వాహనంపై సీతారాముడు

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు వాహనసేవ జరిగింది. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారు వేణుగాన అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుంది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్పీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

విశాఖ 'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - కడప అర్బన్

విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ 700 రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రయివేటీకరణకు చర్యలు తీసుకోవడం దారుణమని, ప్రయివేటీకరణను అడ్డుకుంటామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి కాపలాదారుగా ఉంటాను, దేశాభివృద్ధికి పాటుపడుతానని ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడి దేశసంపదను తెగనమ్ముతున్నారని పేర్కొన్నారు. లాభాలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వాపోయారు. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేసి ఆంధ్రుల ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యవహరించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఉద్యమాలు కొనసాగడంతో పోస్కో కంపెనీ వెనకడుగు వేస్తోందని చెప్పారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి కె.సి. బాదుల్లా, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వి. సుబ్బయ్య, సిడబ్లుసి ఎఐటియుసి నాయకులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - కడప

ఖైదీల ఆరోగ్య విషయం పట్ల వైద్యులు ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. శని వారం ఆమె పురుషుల కేంద్రకారంలో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించారు. అనంతరం పురుషులు, మహిళల కేంద్ర కారాగారాలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. మానసిక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలతో ఆమె స్వయంగా మాట్లాడారు. వారి ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో మందులను వాడాలి అని సూచించారు. వైద్యులు ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 30 మంది మహిళ ఖైదీలకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని జడ్జి ప్రారంభించారు. ఇలాంటి శిక్షణలు నేర్చుకోవడం వల్ల జీవనోపాధికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఆమె వెంట పురుషుల కేంద్ర కారాగార డిప్యూటీ సూ పరింటెండెంట్ ఆఫ్ ప్రిజన్ జవహర్ బాబు, ఉమెన్ కేంద్రకారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ప్రిజన్ కృష్ణవేణి, వైద్యాధికారులు, పారా లీగల్ వాలంటీర్ సురేష్ సహాయం, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ ఓబుల్ రాజు, ఖైదీలు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న జడ్జి

ప్రతిపక్ష నేతలపై దాడి అమానుషం

ప్రజాశక్తి - కడప

అమరావతిలో బిజెపి నేతలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రతిపక్ష నేతలపై దాడికి పాల్పడడం, అమానుషమని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కడప నగరంలోని తన సొంత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎప్పటికీ అమరావతేనని, దీనిని కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్ సాక్షిగా మంత్రులు ఈ విషయాన్ని ధ్రువపరిచారని తెలిపారు. ఎపిలో ఉన్న ప్రతి పౌరుడూ అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని చెప్పారు. అమరావతి రైతులు 1200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్దండ రాయుని పాలెంలో నిర్వహించిన సభకు వచ్చిన బిజెపి అగ్ర నాయకులు, వైసిపి నాయకులు మూడు రాజధానులను మద్దతుదారుల ముసుగులో ప్రతిపక్ష నాయకులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో 22, 44, 46 డివిజన్ల ఇన్‌ఛార్జులు ఖాజా పీర్, శ్రీనివాసులు, భరత్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

రిమ్స్ ప్రిన్సిపల్‌కు అభినందనలు

కడప సిటీ : రిమ్స్ కళాశాలలో పీజీ సీట్ల పెంపునకు కృషి చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖను పలువురు వైద్యులు, సిబ్బంది అభినందించారు. శనివారం కేక్ కట్ చేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేడియాలజీ, అంకాలజీ విభాగంలో 5, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో 9 సీజట్లు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. సీట్లు రావడానికి కృషి చేసిన వారందరికీ ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డాక్టర్ గోపి కృష్ణ , రేడియేషన్ అంకాలజీ విభాగాదిపతి డాక్టర్ ఏ.సుజాత పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న వైద్య సిబ్బంది

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి

కలసపాడు : ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మూడవ విడత ఆసరా కార్యక్రమాన్ని ఎంపిడిఒ మహబూబ్ బి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మండల అభివృద్ధి గురించి మహిళలు చేస్తున్న వివిధ రకాల కార్యక్రమాల గురించి ఎంపిడిఒ ప్రజా ప్రతినిధులకు, తెలియజేశారు. రాష్ట్ర ఏర్పడినప్పటి నుంచి మహిళల ఆర్థికంగా ముందుకు ఎదగాలని సంకల్పవంతో, బ్యాంకు సహకారంతో రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. బద్వేల్ ఎమ్మెల్యే సుధా మాట్లాడుతూ జగనన్న మహిళల పక్షపాతిగా ఉంటూ, ఎప్పటికప్పుడూ వారి అభివృద్ధికి తోడపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి అంగన గురివిరెడ్డి, ఎంపిపి నిర్మల నారాయణ, సింగిల్‌విండో అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, మాజీ ఎంపిపి, రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, సచివాల బూత్ కో-ఆర్డినేటర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు శివలీల, పుల్లెం, గురమ్మ, వై. ఓబులమ్మ, వై లైసెమ్మ, ఓ సంజయ్ రాజ్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కార్డియాక్ అరెస్టుతో గర్భిణీ మృతి

ప్రజాశక్తి-కడప సిటీ

మృత శిశువుతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణిచికిత్స సమయంలో కార్డి యాక్ అరెస్టుతో మృతి చెందారని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దువ్వూరు మండలం బయన పల్లెకు చెందిన లక్ష్మిదేవి (27) నెలలు నిండడంతో ప్రసవం కోసం జమ్మలమడుగులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లారన్నారు. గర్భంలో శిశువు మృతిచెందడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు ఆమెను రిమ్స్‌లో శుక్రవారం చేర్పించారని తెలిపారు. లక్ష్మిదేవిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని బంధువులకు చెప్పి చికిత్సను ప్రారంభించారని చెప్పారు. గర్భం నుంచి మృతశిశువును తీసిన తరువాత రక్తస్రావం అధికమైందని, అందు కోసం వైద్యులు చికిత్స ప్రారంభించారని తెలిపారు. అదే సమయంలో ఆమెకు కార్డియాక్ అరెస్టు కావడంతో సిపిఆర్ మొదలు పెట్టరన్నారు. లక్ష్మిదేవికి డిఐసి వ్యాధి ఉన్న కారణంగా ప్రాణాలు కోల్పోయిందని వివరించారు. ఆమె మృతి విషయాన్ని బంధువులకు తెలియజేశామని చెప్పారు. సమావేశంలో గైనిక్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ సుశీల, డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

మృతిచెందిన లక్ష్మీదేవి

భీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న భీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఇంటర్మీడియట్ ఆర్‌జెడి రవికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల యాజమాన్యం ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ఇష్టానుసారంగా ప్రచారం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జెఇఇ, నీట్ వంటి పేర్లు చెప్పి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిబంధనలు పాటించని భీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ నాయక్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి దండ్రుల కలలను సాకారం చేయాలని సమగ్ర శిక్ష పథక జిల్లా అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం నగరంలోని రామాంజనేయపురం ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించి అక్కడి విద్యార్థులతో సమావేశమయ్యారు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం తోడుంటే దేన్నైనా అధిరోహించగలమని సూచించారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకో గలమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రసూల్ సమగ్ర శిక్ష ఎపిఒ రజినీకా ంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

చిరుధాన్యాలలో అధిక పోషకాలు

చెన్నూరు : చిరుధాన్యాలలో అధిక పోషకాలున్నాయని, వీటిని గర్భిణులు, బాలింతలు తీసుకుంటే రక్తహీనత తగ్గి ఆరోగ్య వంతులుగా ఉంటారని ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మజ అన్నారు. శనివారం స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్ర.జలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు చిరుధాన్యాల గురించి, అలాగే వాటి ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు. ఫాస్ట్‌ఫుడ్ బదులు ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్ బాబు, పిహెచ్‌సి వైద్యాధికారి వంశీకృష్ణ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ ఐసిడిఎస్ పీడీ రమాదేవి, సిడిపిఒ ప్రభావతి, ఎపిఎం గంగాధర్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై విమర్శలు దారుణం

కడప : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై బిజెపి నేతలు సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని రైతుల ఉద్యమం 1200 రోజులకు చేరిన సందర్భంగా 260 మంది రైతులను రైతులు బలి తీసుకున్నారని మాట్లాడడం సరికాద అన్నారు. అమరావతిలో తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. టిడిపి అధికారం కోల్పోయిన తర్వాత తన మనుగడ కోసం వైసిపి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు, అమరావతి రైతులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉసిగొలిపి వారిని బలి తీసుకుందని చంద్రబాబు అన్నారు. ప్రభు త్వంపై బురద చల్లేందుకు టిడిపి చాలా కుట్రలు చేస్తుందని ప్రజలు వాటిని నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

రేపు డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థులకు మెగా డిఎస్‌సి విడుదల చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 3న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం పాత బస్టాండ్‌లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చాక ఏటా డిఎస్‌సి వస్తుందని, నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఒక్క డిఎస్‌సి కూడా రాలేదని తెలిపారు. సోమవారం డిఇఒ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ సన్నివేశాన్ని తొలగించాలి

కడప అర్బన్ : దసరా సినిమాలో అంగన్వాడీ ఉద్యోగులను గుడ్లు దొంగతనం చేసే వారిగా చిత్రీకరించిన సన్నివేశాన్ని తక్షణమే తొలగించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. లక్ష్మీదేవి, లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలపై సరైన అవగాహన లేకుండా చిత్రీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. హీరోయిన్ వెన్నెల తన పాత్రను అంగన్వాడీ టీచర్‌గా చూపించారని సాయంత్రం సమయంలో సెంటర్ తాళం తీసి కొంగులో కోడిగుడ్లు దొంగతనంగా తీసుకెళుతున్నట్లు డైరెక్టర్ చూపించారని పేర్కొన్నారు. ఇది అత్యంత దుర్మార్గమని, ఆ సన్నివేశాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. వాస్తవాన్ని మరచిపోయి అంగన్వాడీలను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- 'అన్నమాచార్య'లో ఘనంగా 13వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అటవీశాఖాధికారి పి.వి. సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో 13వవార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అటవీశాఖాధికారి మాట్లాడుతూ ఎవరైతే క్రమశిక్షణ, అంకితభావం, పెద్దలపట్ల గౌరవం కలిగి ఉంటారో వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. తాను సాధించగలననే ఆత్మవిశ్వాసం ఎంత ముఖ్యమో సాధించేవరకు పట్టువదలకుండా ఖచ్చితమైన క్రమశిక్షణ కూడా అంతే అవసరమని చెప్పారు. అనంతరం అన్నమాచార్యుల విద్యా సంస్థ అధినేత చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడితో కూడుకున్న చదువులకు స్వస్తి చెప్పి విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఆధునిక యుగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను అంది పుచ్చుకోవాలన్నారు. అధ్యాపకులు పాఠ్యపుస్తకాల ద్వారా పొందిన విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ఉపయోగించి వాటి ఫలితాలను గమనించి నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆయన కోరారు, కళాశాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుండే క్రమశిక్షణతో ఇష్టపడి కష్టపడితే జీవితాంతం సుఖంగా ఉండొచ్చుని ఆయన సూచించారు, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సాధించిన ప్రగతిని వివరిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ, విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ గత సంవత్సరం నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్లో ఏ గ్రేడ్ సాధించడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. ఈ ఏడాది ఎన్‌బిఎ, అటానమస్ గుర్తింపు పొందే విధంగా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డి

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : బి. మఠం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే గర్భిణి ప్రసవం కోసం పోరుమామిళ్ల ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు వైద్య సిబ్బంది ఓ నెగెటివ్ రక్తం అవసరమని సూచించారు. గర్భిణి బంధువులు రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్టును ఆశ్రయించడంతో బి. మండల ఆర్ఐ సింధుజను సంప్రదించి ఆమెచే రక్తదానం చేయించారు. మహిళలు రక్తదానం చేయడం అరుదైన విషయమని ఈ సందర్భంగా దాతను ట్రస్టు వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్, గర్భిణి బంధువులు అభినందించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ ప్రసాద్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్ , రమణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కడప అర్బన్ : అచ్చెన్న హత్య వెనకాల ఉన్నత స్థాయి అధికారులు రాష్ట్రస్థాయి అధికారుల హస్తం ఉన్నందున సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్ క్లబ్ డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మునయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ, పాలీ క్లినిక్ డిడిగా పనిచేస్తున్న డాక్టర్ అచ్చెన మార్చి 12న సిఎస్ఐ చర్చివద్ద కిడ్నాప్ అయ్యి ఈనెల 24న న్నమయ్య జిల్లా రామాపురం, గువ్వల చెరువు ఘాట్‌లో అను మానాస్పద స్థితిలో మృతిచెందారని పేర్కొన్నారు. ఇందులో పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌తో పాటు మరో ఇద్దరు హత్య చేసినట్లు వారే స్వ యంగా విఆర్ఒ లొంగిపోయారని తెలిపారు. పోలీసులు కోర్టులో విచారణ పిటిషన్ దాఖలు చేయకపోవడం పట్ల అనేక అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఈనెల 8న అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేయాలని నిర్ణ యించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, అవ్వారు మల్లికార్జున, జి.వి. రమణ, సంగటి మనోహర్, అంబేద్కర్ మిషన్ ప్రముఖ న్యాయవాది సంపత్ కుమార్, టిడిపి నాయకులు ఆమూరి బాలదాసు, కొండా సుబ్బయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, ఓబులేష్, దళిత మిత్రా సంఘం కైపు రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ వెటర్నరీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ, పవన్, బిఎస్‌పి, ఎమ్మార్పీఎస్ నాయకులు,యాదవ్, లోక్ సత్తా పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, ఎస్ఎసత్తార్, మోహిద్దీన్, జయన్న పాల్గొన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు

కడప : ఉమ్మడి కడప జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు ఒంటిపూట కళాశాలలను నిర్వహించేందుకు అనుమతించిన యోగివేమన యూనివర్సిటీ రిజిస్టర్ ఆచార్య వెంకటసుబ్బయ్యకు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) జిల్లా అధ్యక్షులు డాక్టర్ శశికాంత్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ నీలయ్య, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. వంటి పూట కళాశాలలను నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

బరితెగింపు!

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి ఘటనలు బరితెగింపును తలపించాయని చెప్పవచ్చు. ఇందులో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్య ఒకటి. పులివెందుల యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో తుపాకీ కాల్పులు చోటుచేసుకోవడం మరొకటి. ఇందులో మొదటి ఘటనలో పశుసంవర్ధకశాఖ డిడి అచ్చెన్నను డిపార్టుమెంట్ ఉద్యోగులే కక్షగట్టి హత్య చేసిన తీరు విస్మయాన్ని కలిగించింది. ఆర్నెళ్లుగా పశుసంవర్ధక శాఖలో ఉద్యోగుల మధ్య నెలకొన్న విభేదాలు సీరియల్‌ను తలపించడం తెలిసిందే. ఉద్యోగుల మధ్య విభేదాలను తొలగించడానికి బదులు పెంచడానికి జిల్లా ఉన్నతాధికారులు దోహదం చేశారనే వాదన ఆందోళన కలిగిస్తోంది. ధర్నాలు, నిరసనల దశలోనే డిప్యూటేషన్ పేరుతో ముగ్గురు ఉద్యోగులను మూడు ప్రాంతాలకు పంపించి ఉంటే ఇటువంటి ఘటనకు దారితీసేది కాదనే వాదన వినిపిస్తోంది. తనను ముగ్గురు ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అచ్చెన్న పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు అవసరమైన మేరకు భద్రతా పరమైన చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరం. జిల్లా అధికారుల వైఫల్యాలకు ఫలితం హత్య చోటుచేసుకోవడం, అనంతరం ఒక డిపార్టుమెంట్ ఉద్యోగిని ఎ-1 నిందితునిగా, అతనికి సహకరించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేయడం, త్రిసభ్య కమిటీ విచారించడం, తాజాగా జాతీయ ఎస్‌సి కమిషన్ విచారణ పరిశీలనకు రావడంతో వ్యవహారం వేడెక్కింది. జిల్లా ఎస్‌పి మర్యాదపూర్వకంగా కలిసి కేసు పూర్వాపరాలను వివరించడం తెలిసిందే. అనంతరం అఖిలపక్ష సభ్యులు జాతీయ ఎస్‌సి కమిషన్‌ను కలిసి ఆందోళనలు నిర్వహించిన అనంతరం డిడి అచ్చెన్న హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. జిల్లా, రాష్ట్ర ఉన్న తాధికారులను సకాలంలో స్పందించి ఉంటే ఇటువంటి దుర్ఘటనకు అవకాశం లేకుండా పోయి ఉండేది కాదేమో. ఇదిలాఉండగా పులివెందుల పట్టణంలో ముగ్గురు యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తుపాకీ కాల్పులకు దారితీయడం విస్మయాన్ని కలిగించింది. ముగ్గురు యువకుల మధ్య చోటుచేసుకున్న ఆర్థిక లావాదేవీలు కాల్పుల స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగించింది. యువతకు గన్‌లైసెన్స్‌లు ఇవ్వడమే ఆందోళనకరం. యువదశలో ఉద్రేకాలు, ఉద్వే గాలు హెచ్చుస్థాయిలో ఉంటాయనేది అందరికీ తెలిసిందే. అటువంటి దశలోని యువకులకు గన్‌లైసెన్స్ ఇచ్చేసమయంలో ముందూ వెనకా ఆలోచించి ఉండాల్సి ఉంది. పైగా అతను ప్రముఖ రాజకీయ నాయకుడా, ఫ్యాక్షనిస్టా అంటే కాదు కదా, ప్రబలమైన శత్రువులు ఉండటానికి, అలాంటి యువకునికి గన్‌లైసెన్స్ ఇవ్వడంపై ఆలోచించాల్సి ఉంది. ఎవరి పరిస్థితి ఎలా ఉన్నా యువకులకు గన్ లైసెన్స్ మంజూరు చేయడంపై మరింత చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు నిరూపితమే తాజా ఘటన. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం గన్‌లైసెన్స్‌లు మంజూరు చేయడంలో మరింత విజ్ఞత, పారదర్శకతను పాటించాల్సిన అవసరం ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బీరు, మందు బాటిళ్లతో దర్శనమిస్తున్న ఈద్గా పరిసర ప్రాంతం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడేనా..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట ఎప్పుడు పడుతుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు పలు రకాల చర్యలు తీసుకుంటున్నా .. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆగడాలకు అడ్డుకట్టపడడంలేదు. మందు బాబులు పొలాలు, ప్రార్థనా మందిరం వద్ద, ఇసుక దిన్నెలలు, కంపచెట్ల పొదల వద్ద కూర్చొని సేవిస్తున్నారు. అనంతరం అక్కడే ఖాళీ సీసాలను, వ్యర్థాలను అక్కడే పడేసి వెళుతున్నారు. విద్యార్థులు కూడా కళాశాలలకు వెళ్లకుండా బైక్‌లలో ఇష్టమొచ్చినట్లు తిరుగుతున్నారనే ఆరోపణలున్నాయి. లాడ్జీలు, గండికోట రోడ్డు, ముద్దనూరు రోడ్డు, పెద్దపసుపుల రోడ్డు, రైల్వేస్టేషన్ పరిసరాల కంపచెట్లు, గుట్టలను, కోనలను స్థావరాలుగా చేసుకొని విద్యార్థులు వారి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టి, వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ఉద్యోగాలకు సిబిఐటి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులకు మార్చిలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 102 మంది టెక్నికల్ ఇంటర్వ్యూలకు ఎంపిక కాగా, అందులో 54 మంది హెచ్‌ఆర్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇందులో 28 మంది సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఉద్యో గాలకు అర్హత సాధించారు. తమ కళాశాల విద్యార్థులు ఎంపసిస్ కంపెనీకి ఎంపిక కావడం పట్ల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ వై.శ్రీధర్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పనులను త్వరగా పూర్తిచేయాలి : ఓఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆ పనులను శనివారం ఓఎస్‌డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జవహర్ మునీర్

విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం నో స్కూల్ బ్యాగ్ డే సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు లేకుండా కేవలం ఆటలు, అల్లికలు, కథలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నెలలో రెండు శనివారాలు విద్యార్థులకు ఇలా పుస్తకాలు లేకుండా అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జవహర్ మునీర్ విద్యార్థులకు పేపర్‌తో బొమ్మల తయారీ, డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. సిద్దారెడ్డిపల్లె పాఠశాలలో విద్యార్థులతో కథలు చెప్పించారు.

వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు సంతోషకరం

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని మానవతా సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పులివెందుల రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద మానవతా సభ్యుడు బాలాజీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్నాయన్నారు. పాదచారులకు, ప్రయాణికులకు దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలు పెట్టడం వల్ల ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మానవతా సేవా సంస్థ సభ్యుడు బాలాజీ సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మానవతా సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, మానవతా మండల కన్వీనర్ కృష్ణతేజా, మానవతా సభ్యులు బాలాజీ, శ్రీకళ, రవిశంకర్ గౌడ్, రామమునిరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

పశువుల పట్ల వేసవిలో అప్రమత్తత అవసరం

- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పశువైద్యులు

ఆరుబయట పాకలో ఉన్న పశువులు

డాక్టర్ మహమ్మద్ గౌస్

ప్రజాశక్తి-చాపాడు

వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా వాటి యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బతో పశువులు అనారోగ్యానికి గురవుతాయని తెలిపారు. పశువులను ఎండకు వదిలేయ వద్దని హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రతకు పశువు శక్తిని కోల్పోయి, శక్తి సామర్థ్యాలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా పాల దిగుబడిపై ఎండ ప్రభావం పడుతుందని అంటున్నారు.. శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట ఎక్కువగా బయటకు రావడం, అధికంగా దాహం వేయడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం గమనించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బకు పశువులు ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావాలు జరగడం వంటి సమస్యలు ఎక్కువ ఎదురవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ సమస్యల నుంచి పశువులను కాపాడుకోవాలంటే పలు యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలని చాపాడు పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ సూచిస్తున్నారు.

జాగ్రత్తలు: పశువులను ఉదయం 10 గంటల వరకు మాత్రమే మేత కోసం వదిలేయాలి. తర్వాత వాటికి గాలి తగిలే పాకలో మాత్రమే ఉంచాలని సూచిస్తున్నారు. అవసరమైతే సాయంత్రం 4గంటల తర్వాత మాత్రమే తిరిగి వదలాలని సూచిస్తున్నారు. పాకలలో గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలన్నారు. ఆ మేరకు పాకల ఎత్తు సుమారుగా 12 అడుగుల వరకు ఏర్పాటు చేసుకోవలంటున్నారు. పాకలకు ఇరువైపులా ఉండే పక్క గోడలను మాత్రం 4 అడుగుల లోపు మాత్రమే ఉంచాలని సూచిస్తున్నారు. పాకలకు ఇరుపక్కల నీడనిచ్చే చెట్లను పెంచుకోవాలని, వాటిలో కూడా పశుగ్రాసపు చెట్లను పెంచుకుంటే నీడతో పాటు పశుగ్రాసంగా కూడా దొరు కుతుందని అంటున్నారు. పాకలలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే పశువులు తట్టుకోలేవని, కాబట్టి శీతలస్థితి ఉండేలా తగు జాగ్రత్తలు చేసు కోవాలంటున్నారు. ఉష్ణోగ్రతను తగ్గించడానికి పాకలకు ఇరువైపులా గోనె సంచులను కట్టి రెండు మూడు సార్లు నీటితో తడపడం వలన ఉపయోగంగా ఉంటుందని పేర్కొంటున్నారు. గాలి పంకాలను కానీ, కూలర్లనుకానీ అమర్చడం ద్వారా ఎండ తీవ్రతను తగ్గించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. నీటి షవర్స్, ప్రింక్లర్స్ ఏర్పాటు చేసి నీటి తుంపర్లను పడేలా చేయడం మంచిదని అంటున్నారు. పాకల పైకప్పు భాగాన్ని తాటి ఆకులతో లేదా గడ్డితో కప్పినట్లయితే ఉష్ణోగ్రత తగ్గుతుందని సూచిస్తున్నారు.. నీటి కుంటలలో, పారే నీటిలో పశువులను ఈత కొట్టించడం మంచిదని తెలిపారు..

చికిత్స : వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. చల్లటి ప్రదేశంలో ఉంచి తేలికగా జీర్ణమయ్యే జావ, గంజిలో ఉప్పును తగిన మోతాదులో కలిపి ఆహారంగా ఇవ్వాలంటున్నారు. వైద్యులతో డెక్రోస్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి, విటమిన్ ఎ,డి, సి, బి కాంప్లెక్స్ ఇంజక్షన్ ఇప్పించాలంటున్నారు. రోజుకూ 40 లీటర్ల నీటిని తాగించాలని, ఫైటో కూల్ ద్రావణాన్ని రోజుకు 10మిల్లి లీటర్ల చొప్పున తాగించాలని సూచిస్తున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

సోమవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోయే ఓపెన్ ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్ కుమార్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్ పదవ తరగతి, ఓపెన్ ఇంటర్, పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఆ మేరకు ఇప్పటికే షెడ్యూల్ కూడా విడుదల చేశారన్నారు. కానీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుండి ఇప్పటికే డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. అంతే కాకుండా వివిధ రకాల మార్గాల్లో కూడా విద్యార్థుల చేత పరీక్షలు రాయించడానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక అధికారులు, ఉన్నత అధికారులు పటిష్టంగా పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఈ విషయాలను డిఇఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. 4నెలలుగా విద్యార్థి నాయకులు అధికారులకు మార్కెట్ హైస్కూల్ వద్ద ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు చేయాలని విన్నవించినా, ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. పరీక్ష కేంద్రాలను కూడా అధికారులు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సరైన రీతిలో కేటాయించలేదన్నారు. జడ్‌పి మార్కెట్ హైస్కూల్‌లో ఒక్క ప్రయివేట్ స్కూల్ విద్యార్థులకు మాత్రమే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారని, ఇది అనేక అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. కార్యక్రమంలో అరుణ్, వెంకటేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత రవాణా

ప్రొద్దుటూరు : సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత రవానా సౌకర్యం కల్పించినట్లు పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పసుపుల సుబ్బరాయుడు తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు స్ఫూర్తినిచ్చిన సిబిఐ మాజీ సంయుక్త సంచాలకులు లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆటో ద్వారా ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 8:30గంటలకు రామేశ్వరం గుడి దగ్గర నుండి గాంధీ రోడ్డు, టిబి రోడ్డు, శివా లయం సర్కిల్, మైదుకూరు రోడ్డు, కశెట్టి ఉన్నత పాఠశాల వరకు ఉచిత సౌకర్యం కల్పిస్తామన్నారు. తమ ఆటోలో ప్రయాణించిన ప్రతి విద్యార్థికి పెన్ను కూడా ఉచితంగా ఇస్తామన్నారు. విద్యా ర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుబ్బరాయుడు కోరారు.

పదవ తరగతి పరీక్షలకు అయిదు కేంద్రాలు

ఎర్రగుంట్ల : సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా అయిదు కేంద్రాలను ఏర్పాటు చేసినసట్లు ఎంఇఒ సుబ్బారావు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఈనె 18వ తేదీ వరకు ఉంటాయన్నారు. విద్యార్థులు ఉదయం 9:30లోపు పరీక్షా కేంద్రాన్ని చేరుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 1086 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందులో 843 మంది రెగ్యులర్ స్టూడెంట్స్ కాగా 243 మంది సప్లిమెంటరీ స్టూడెంట్స్ ఉన్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కనీస వసతుల ఏర్పాట్లు చేశామని ఎంఇఒ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెద్దముడియం

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో శనివారం వైఎస్ఆర్ ఆసరా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వైఎస్ఆర్ ఆసరా ద్వారా మహిళల కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేశారన్నారు. తద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన మహిళలను కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆనంద్ నాయక్, జడ్‌పిటిసి హిమజ, ఎంపిపి పాపనపల్లి సుధ, వైస్ ఎంపిపి సి.కిరణ్మయి, తహశీల్దారు జ్యోతి రత్నకుమారి, ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఎపిఎం వెంకటసుబ్బయ్య, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ సి.మనోహర్ యాదవ్, డ్వాక్రా సంఘం మహిళలు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైభవం.. అంకాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి - వల్లూరు

మండల కేంద్రంలో శీ మహంకాళి అంకాలమ్మ దేవి తిరుణాల మహోత్సవాన్ని శనివారం వైభంగా నిర్వహించారు. వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాత్రి 7 గంటలకు ఊంజలసేవ, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. 8 గంటలకు శ్రీ సాసవల చిన్నమ్మ కథ విన్పిస్తారు. అమ్మవారికి అబిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం కుంకుమ బండ్లు, అమ్మవారికి బోనాల సమర్పిస్తారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు కొర్లబండి తిరిగే కార్యక్రమం నిర్వహిస్తారు. తిరుణాల్లో భాగంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేల ఇవ్వనున్నారు. ఐదవ బహుమతిగా రూ. 15 వేలు, ఆరో బహుమతిగా రూ. 10 వేలు, ఏడో బహుమతి రూ.7,500 ఇవ్వనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలలో ఆదివారం చెక్కభజనతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు సోమవారంతో తిరుణాల ఉత్సవాలు ముగియనున్నాయని పేర్కొన్నారు.

అలంకరించిన అంకాలమ్మ దేవాలయం

ఆర్చీని త్వరగా నిర్మించండి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆర్చీని త్వరగా నిర్మించాలని సిపిఎం కార్యదర్శి వీరనాల శివనారాయణ కోరారు. ఆర్చి నిర్మాణానికి తీసిన గుంతలను పూడ్చాలన్నారు. ఆ మేరకు శనివారం ఆయన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ తవ్విన గుంతలు తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా బస్సుల స్టాపింగ్ అక్కడే ఉండడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరుగ ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసు, కృష్ణ, రవి పాల్గొన్నారు.

గుంతను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రెండు వికెట్ల తేడాతో టీం-బి విజయం

కడప: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్-12, 14 ఏజ్ గ్రూపులను రెండు విభాగాలుగా విభజించి లీగ్ మ్యాచ్ నిర్వహించింది. ఈ మ్యాచ్ లో టీం -బి రెండు వికెట్ల తేడాతో టీం-ఏ పై విజయం సాధించింది. తెలుత బ్యాటింగ్ చేసిన టీం-ఏ 60 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ఆ జట్టులోని అంబటి శ్రేయన్ రెడ్డి 54 (నాట్ అవుట్), పి అస్కాన్ ఖాన్ 20 పరుగులు చేశారు. టీం -బి లోని ఎం. అక్షాంత్ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 175 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన టీం-బి 59.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని తాహిర్ 51(నాటౌట్), నిఖిల్ 25 పరుగులు చేశారు. టీం -ఏ లోని వర్షిత్ 2, శ్రీను 2, ఫైజాన్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సిసిటివి కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ కోర్సులో 13 రోజులు పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18- 45 సంవత్సరాల లోపు వయసుగల అభ్యర్థులు ఉచిత శిక్షణను పొందేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో 13 మందికి ఉద్యోగాలు

మదనపల్లె అర్బన్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ నిర్వహించిన సెలెక్షన్స్‌లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఎంపికైన విద్యా ర్థులకు సంవత్సరానికి రూ.నాలుగు లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, టిపిఒ మనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ లోకేష్, మునికుమార్ విద్యార్థులకు అభినందించారు. **పీలేరులో..** ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల ఛైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. టాప్ ఆకాడమీ ఆధ్వర్యంలో కంపెనీ హెచ్‌ఆర్ సుఫియాన్ ఖాన్ పర్యవేక్షణలో ప్రాంగణ ఎంపికలో భాగంగా నిర్వహించిన రాత పరీక్షకు 125 మంది విద్యార్థు హాజరు కాగా వారిలో 27 మంది విద్యార్థులు అర్హత సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లేస్ మెంట్ ఇన్‌చార్జి రెడ్డి ఖాసీం, డాక్టర్ సత్యరాజ్ పాల్గొన్నారు.

బైఠాయించి నిరసన తెలుపుతున్న అకౌంట్స్ సిబ్బంది

ఆర్‌టిపిపిలో కొనసాగుతున్న నిరసన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో అకౌంట్స్ సిబ్బంది పని వేళల్లో మార్పులకు నిరసనగా చేపట్టిన ధర్నా శనివారం కూడా కొనసాగింది. ఎపి జెన్‌కోలో పనిచేస్తున్న అకౌంట్ సిబ్బంది ప్రస్తుతం ఉదయం 10:30కు విధులకు హాజరు కావలసి ఉండగా, ఆ పని వేళలను మార్పు చేస్తూ ఈనెల 1వ తేదీ నుంచి 9 గంటలకు రావాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విధులకు హాజరు కాకుండా సిఇ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అకౌంట్స్ సిబ్బంది చేస్తున్న నిరసనకు కార్మిక సంఘాలు, ఇంజనీర్స్ అసోసియేషన్స్ మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలని ఇన్‌ఛార్జి దేరంగుల చంద్రమౌళి అన్నారు. శనివారం స్థానిక మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో శనివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో నగిరిగుట్ట సచివాలయ కన్వీనర్లు, గృహసారధుల సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు మల్లికార్జున, గుల్జార్, వైసిపి నాయ కులు నాగరాజు, డేనీ, మస్తాన్, సంపత్, పోస్ట్ బాలయ్య, కుల్లాయప్ప, అజయ్ పాల్గొ న్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ప్రజలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్ర ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దస్తగిరిపేటలో ఆయన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ వైసిపి నేతల దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైపల్యాలను వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. కార్యక్రమంలో ఫిట్టర్ రఫీ, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, మస్తాన్ గోలే, ఖలీల్‌బాషా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండలంలోని కవలకుంట్ల జడ్‌పి హైస్కూల్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెరుకూరి రవికుమార్ సహకారంతో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పాడడమేగాక విద్యా అభివృద్ధిలోనూ ముందుంటుందని చెప్పారు. పోరుమామిళ్ళ, కలసపాడు, బి.కోడూరు, కాశినాయన మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించేందుకు చెరుకూరి రవికుమార్ ముందుకు రావడం శుభపరిణామం అని అన్నారు. విద్యార్థులు పదవతరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన చెరుకూరి రవికుమార్‌కు ఎస్ఎఫ్ఐ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సురేంద్ర, స్కూల్ టీచర్ ఓబయ్య, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ప్రశాంత్, బబ్లు, జనార్దన్, శ్రీను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపుతప్పిన కారు

కారు అదుపుతప్పి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కారు అదుపుతప్పి నలుగురు గాయపడిన సంఘటన శనివారం మండలంలోని తప్పెట్ల వంతెన వద్ద చోటుచేసుకుంది. కడప నుంచి కమలాపురం వైపునకు కారులో ప్రయాణిస్తుండగా అ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో జమ్మలమడుగు మండలం దుత్తలూరు గ్రామానికి చెందిన నరేష్, రేణుక, అరుణ్, మురళి ఉన్నారు. వీరని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నోటీసు

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: KADAPA

O.S.No: 740 OF 2021

BETWEEN:

బండారు సత్యనారాయణ. ...వాది

AND

యస్.జాకీర్. ...ప్రతివాది

పై దావాలో ప్రతివాదివైన యస్.జాకీర్ అను నీకు ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై తెలిపిన దావా ఒ.యస్.నెం.740/2021లో వాది అయిన సత్యనారాయణపైన తెలిపిన న్యాయస్థానము నందు డబ్బు రికవరీ కొరకు ప్రతివాదివైన నీపై దావా దాఖలు చేసియున్నాడు. అయితే సదరు కోర్టు వారు నీకు ఎన్నిమార్లు దావా సమన్లు/నోటీసులు పంపిననూ వివిధ కారణాల చేత అవి వెనక్కు తిరిగి రావడం జరిగినది. కావున సదరు కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నీకు తెలియజేయడమేమనగా 10.04.2023వ తేది సోమవారము ఉదయము 10.30 గం. నీవు ఖుద్దున కాని లేక వకీలు ద్వారా కాని కోర్టు వారి ఎదుట హాజరై నీకు ఆక్షేపణలు వున్నయెడల కోర్టు వారికి తెలియజేసుకొనవచ్చును. అట్లు కాని ఎడల నీ పరోక్షముగా నిర్ణయించబడును.

పి.భరణి కుమార్ నాయుడు,
M.A.,M.B.A., B.Ed., B.L.,
న్యాయవాది & నోటరి
కడప. సెల్: 9059777747